కథా నిలయం
2069
శ్రీకాకుళం

# పంకజం

"పంకజం"

అప్రయత్నంగా కేకవేశాడు రామారావు. ఆమెను నడివీధిలో అంత పెద్దగా పిలిస్తే అంతా తనవంకే చూస్తారనీ నవ్వుతారనీ అతను భయపడ్డాడు. భిడియపడ్డాడు. తల వంచుకొన్నాడు. తల వంచుకొన్నా, క్రింద ఉన్నది కటిక నేల అయినా అతనికి పంకజం రూపమే స్వచ్ఛ సరోవర జలాలలో అరుణోదయ కాంతులలో వికసన్నవ పంకజంలాగా ఆమె ప్రసన్న వదనమే కన్పించింది. అతని మనసునిండా నిండైన వెన్నెల పరచుకొన్నట్లు అయింది.

కొన్నిక్షణాల తర్వాత అతను తల ఎత్తాడు. పెద్ద దుకాణంముందు వయ్యారంగా నిలబడిన ఆమె కన్పించింది. అతని కేక ఆమెకు విన్పించింది. ఆ పిలుపులో ఆతురత అవగతం అయింది. గొంతు కూడా పోల్చుకొన్నది. అందుకే అక్కడ ఆగింది. అతనివైపే చూస్తూ అలా ఉండిపోయింది.

ఆమె అలా ఆగిందన్నమాటేగాని వయ్యారాలు పోవడం మానలేదు. ఆకర్ణాంతములైన ఆమె నేత్రములనుంచి చూపుల తూపుల పరంపర వెలువడడం ఆగిపోలేదు. అతను అన్నాళ్ళకు ఆమెను అలాచూడగలిగినందుకు తన్ను తాను అభినందించుకొన్నాడు. మురిసిపోయాడు. ఇదంతా కొన్ని క్షణాలు మాత్రమే. అతను ఆ వీధిలో అవతలివైపుకు ఎప్పుడు వెళ్ళాడో ఎప్పుడు ఆమె ఎదురుగా నిలబడ్డాడో అతనికే తెలియదు. రెక్కలుగట్టుకొని

వెళ్ళి ఆమె ముందు వాలాడు. అలా వెళ్ళాడేకాని వెంటనే పలకరించలేక పోయాడు. అతను ఆమెవంక అలా చూస్తూ ఉండిపోయాడు.

ఆమె షిఫాన్‌చీర కట్టింది. సన్నటి జరీ అంచు కుట్టిన జాకెట్టు వేసుకున్నది. ఆ వస్త్రధారణ పద్ధతి మూలంగా ఆమె శరీర సౌష్ఠవం ఆకర్షణీయంగా కనిపిస్తున్నది. స్తనవల్కలముల బిగింపువల్ల రొమ్ములు పొడుచుకొని వచ్చాయి. నడుముపైనా పొట్టపైనా బాగా జానెడు వెడల్పున ఆచ్ఛాదనలేదు. సగంజారిన పమిటసరిచేసుకుందామన్న ఆలోచనేలేదు. శిరోజాలంకరణ మరీ కొత్తగా ఉంది. ఆమెకు అంత జుట్టు అంత ఒత్తుగా, నల్లగా కారుమేఘాన్ని పట్టి, మెలిపెట్టి చుట్ట చుట్టినట్లుగా ఎలా అమరింది! అనుకొంటూ అతడు ఆమె ముఖంలోకి చూచాడు. వెల్లివిరిసిన బొడ్డుమల్లియలు. కాదు వల్ల కలువలు ఇంద్రనీల మణులు. కళ్ళకు సన్నగా పెట్టిన కాటుకరేఖ. నుదట కనిపించీ కనిపించని తిలకం. పాపిట బంగారపు రజను కలిపిన కుంకుమ బొట్టు. మెడమీదా చెంపలపైనా బాగా అద్దిన పౌడరు శరీరఛాయను ఇనుమడింపజేస్తున్నది. ఎంత అందంగా ఉన్నది! అనుకొని అతను మురుసుకున్నాడు.

"పంకజం" నెమ్మదిగా అన్నాడు రామారావు.

ఆ మాట తనకు ఎంత మధురమైనది. మరచిపోదామనుకున్నా మరుపు రానిది. గడచిపోయే కాలం మరిపించాలని ప్రయత్నించినా మనసులో ఉనికి స్థిరం చేసుకున్నది. వలపించి, బులిపించి మధుర మధుర స్వప్నాలకు కారణభూతమయింది. అది తనకు పంచాక్షరి అయింది. ఎన్నో రాత్రిలు కలవరించాడు. ఎన్నో రోజులు పగటి కలలు కంటూ పంకజం పంకజం అంటూ పలవరించాడు.

అతని వాలకం అర్థంకాక విసుక్కుంటూ, కసురుకుంటూనే గడుసుగా నవ్వుతూ, మందహాసం చేస్తూనే కళ్ళు వింతగా గుండ్రంగా తిప్పుతూ “ఇంతకూ తమరెవరు?” అన్నది పంకజం.

“నువ్వు-నువ్వు సరసీరుహం కూతురివి కదూ? పంకజం. పంకజానివేనా నువ్వు” అన్నాడతను తడబడుతూ.

“ఏం? ఎందుకూ? ఇదేం ప్రశ్న పిచ్చిప్రశ్న” అంటూ కోపం ప్రదర్శించి కొన్ని క్షణాల తర్వాత పెద్దగా “అసలు తమరెవరూ?” అని అన్నది మళ్ళీ సాగదీస్తూ.

“నన్ను - నన్ను గుర్తు పట్టలా? నేను - నేను రామారావును”.

ఆమె మాటాడలేదు.

కాని కళ్ళతో సమాధానం చెప్పింది, ఏ రామారావు? ఎందరో రామారావులు. అందరిలో తమరెవరు? వికసించిన పువ్వుల తేనియ ఆస్వాదింప వచ్చే తుమ్మెదలు ఎన్నో! బారులు బారులు. వచ్చి వెళ్ళిన తుమ్మెద మళ్ళీవచ్చి ఎన్ని గుర్తులు చెప్పినా గుర్తించడం ఎలా? అంటున్నట్లు, ఎదురు ప్రశ్నిస్తున్నట్లు చిత్రంగా కనుబొమలు ఎగురవేస్తూ చూచింది. అతని మనస్సు కలుక్కుమన్నది. తల వంచుకున్నాడు. అవును. ఆమె తల్లి అటువంటిదే. కాని ఆమె అటువంటిది కాదు అని గొణిగాడు.

“తమరెవరండీ అంటే అలా తలవంచుకొని ఏదో గొణుక్కుంటారేం? చెబితే మీ ఇంటిమీద పడిపోతాననుకుంటున్నారా?” అంటూ పెద్దగా నవ్వింది పంకజం. మళ్ళీ మళ్ళీ విరగబడి నవ్వింది.

ఆ దారిన పొయ్యేవాళ్లు కొందరు ఆగి వింతగా చూచారు. నవ్వారు. చెవులు కొరుక్కున్నారు. అది చూచి అతను రోషపడ్డాడు. వాళ్ళవంక

కోపంగా చూచాడు. అందుకు ఆమె చిరునవ్వు నవ్వుతూ "మధ్యలో వాళ్ళ మీద ఎందుకూ ఆ కోపం? వీధిలో విరగబడి అకారణంగా నవ్వింది నేను. నామీద కోపగించండి. మీకు అంత అభిమానం అయితే రండి- అదిగో ఆ కనిపించే మనోహర్ హోటల్‌కు వెడదాం. అక్కడ గదిలోకివెళ్ళి కూర్చుంటే మరెవ్వరూ రారు. ఏకాంతంగా అన్నీ మాట్లాడుకోవచ్చును" అని ఒక్క-క్షణం ఆగి "పదండి" అంటూ, అతని భుజంమీద చెయ్యి వేసి, మునివ్రేళ్లతో నెట్టింది. అతను ముందుకు తూలాడు. ఆమె నవ్వుతూ "ఏం డోసు కూడా వేసుకొని వచ్చారా? బాబ్బాబు. ఇక్కడ మాత్రం తూలకండి" అంటూ గబగబా ముందుకు నడిచింది.

హోటలు లోపలకు వెళ్లి, ఆమె కూర్చోమన్నచోట కూర్చున్న అయిదు నిమిషాలకు గాని అతను తల ఎత్తలేదు. సర్వరు వచ్చి ఏమి కావాలో అడిగి తెలుసుకొని వెళ్ళాక అతను నెమ్మదిగా, బాధపడుతున్నట్లుగా "నన్ను నిజంగా గుర్తు పట్టలేదా?" అని అడిగాడు.

ఆమె నవ్వుతూ "అలా అయితే పరాయి వ్యక్తి వీధిలో పేరు పెట్టి కేకవేసి పిలిస్తే నేనుఆగుతానా? అటువంటివ్యక్తిని ఇలా ఇక్కడకు తీసుకొని వస్తానా? ఇంతకూ మీరు అసలు గుర్తుపట్టారా? అని ఒక్కక్షణం ఆగి, కళ్ళు మూసుకొని మోచేతులు బల్లమీద ఆనించి, రెండు అర చేతులలో చెంపలు చేర్చి, మునివ్రేళ్ళతో కణతలు నొక్కుకొంటూ "ఆ ఇప్పుడు చెప్పండి. నేను నాటకాలలో క్రొత్తగా వేషాలు వేస్తున్న రోజులలో తటస్థపడ్డారు. గ్రహచారం బాగుండక మన సంగతి ముందే బయట పడిపోయింది. నన్ను పెళ్ళాడేస్తానన్నారు. కాని మా అమ్మ వల్లకాదన్నది. కావాలంటే ఉంచుకోనిస్తానన్నది. అవునా! ఇప్పటికైనా జ్ఞాపకం వచ్చిందా?" అని అడిగింది.

"ఏం మాటలవి పంకజం!" అన్నాడు అతను కొంచెం పెద్దగా ఆమె నవ్వుతూ "అమ్మయ్య. ఇప్పటికి జ్ఞాపకం వచ్చిందా. కాని నేనన్నది తప్పు మాటేం కాదులెండి. అప్పటికి నాకు ఇంకా క్రొత్త. ఏపుగా ఎత్తుగా ఎదిగా నన్నమాటేగాని, పెద్దమనిషి కూడా అయ్యానన్న మాటే గాని నా కా వ్యవహారం బొత్తిగా తెలియదు. తెలిస్తేనా!" అన్నది.

"పంకజం" పెద్దగా అరిచాడతను.

"మీరేం మారలేదే! ఇంతవరకు మిమ్మల్ని కాస్త ఉడికించాలనీ, ఆటలు పట్టించాలనీ, ఏమేమో అన్నాను. ఇంకేమీ అనను" అన్నది. అంతలో సర్వరువచ్చి ఫలహారాలు బల్లమీద పెట్టి వెళ్ళాడు,

"ముందు అట్టు తినండి. తర్వాత ఉప్మా. నాకు రెండూ కలిపి తెచ్చాడు. నాకు అలా ఇష్టం. నాట్యం, సంగీతం కలిపి ప్రదర్శించడం లాగా. ఇవి అయ్యాక కాఫీ లేదా చల్లని పానీయం తెప్పిద్దాం. సరేనా?" అంటూ ఆమె చనువుగా మునివ్రేళ్ళతో అతని బుగ్గలు పుణుకుతూ "ఏం కోపం వచ్చిందా? పోన్లెండి అవన్నీ మరచిపోయినట్లు నటిస్తాను. నా బ్రతుకు అంతా నటనేగా? మీకేం మగమహారాజులు. ఏం చేసినా చెల్లుతుంది. నేనంటే ఇష్టపడ్డారు. పెండ్లి చేసుకొంటానని అందరితో చెప్పారు. నేను ఆశపడ్డాను. తీరా మా అమ్మ ఒప్పుకోకపోతే వెళ్ళిపోయారు, కాదు పారిపోయారంటాను. అందుకే మళ్ళీ కన్పడలేదు. అంచక్కా నన్ను లేవదీసుకొని పోయిఉండకూడదూ. నేను అందుకు సిద్ధపడ్డానుగా" ఆమె ఒక్క క్షణం మాటాడడం మాని అతని చెయ్యి పట్టుకొని "నామీద ఒట్టేసి చెప్పండి. నిజం చెప్పండి. నేను రానన్నానా?" అని అడిగింది అంతలో ఆమె నేత్రాలు అశ్రుపూరితములైనాయి అతను చూడకుండా వెంటనే కళ్ళు తుడుచుకొని కొంచెం పెద్దగా "లేచి పోవడం అంటే ఏమిటో, కాపురం చెయ్యడం అంటే ఏమిటో నాకు బొత్తిగా తెలియక పోయినా, నావాళ్ళను వదిలేసి మీతో

వస్తాననే అన్నాను. అవునా?" అని మళ్ళీ అడిగింది. అతను గాలికి కదులుతున్న తలుపు రెక్కల వంక చూస్తూ భయపడుతున్నట్లుగా నెమ్మదిగా "ఇక్కడేనా ఈ మాటలన్నీ?" అన్నాడు.

"అయితే మరి త్వరగా అవి తినేసి కాఫీ సేవించి బయటకు పదండి" అన్నది కోపంగా. ఒకటి రెండు నిముషాల తర్వాత ఆమె "అవి వేడిగా ఉన్నప్పుడే తినండి. ఎంత క్లాసు హోటల్ అయినా తినడం జాగు చేస్తే బాగుండవు. చప్పగా చల్లారిపోతే వయసు మళ్ళిన వేశ్య మాతలా ఉంటాయి" అన్నది అలా అంటూ అమె చీరకొంగు అడ్డం పెట్టుకొని బుఱుక్కున నవ్వింది. అతను కూడా చిరునవ్వు నవ్వుతూ ఆమెవంక ఆపేక్షగా పరీక్షగా చూచాడు.

చెంపకు చేరడేసి ఉన్న ఆ కళ్ళల్లో ఎంత ఆకర్షణ ఉన్నది. కనుముక్కు తీరు అందంగా తీర్చిదిద్దినట్లున్నది. చక్కని పలువరుస. రక్త వర్ణంలో క్రొత్త అందం సంతరించుకొని, చిరునవ్వులు ఎప్పటికీ నిలువరించుకొంటున్న పెదిమలు. అవి నలిగిన గులాబీ రెక్కలలా ఉన్నాయి.

"ఆమె నిజంగా అందగత్తె, నేను పూర్వం మొదట చూచినప్పుడు ఎంత అందంగా ఉన్నదో ఇప్పుడూ అంత అందంగా, ఆకర్షణీయంగా ఉన్నది. వేషధారణలో అలంకరణలో ఎంతగా నాగరికులను అనుకరించినా కావాలని గడుసుగా మాటాడాలని ప్రయత్నించినా ముఖంలో, అంతర్యంలో అమాయకత్వమే ద్యోతకం అవుతున్నది. పాపం ఈమె జీవితం ఎలా గడిచిందో, అనుకుంటూ అతను ఆమె వంక మళ్ళీ మళ్ళీ చూచాడు.

ఆమె పచ్చటి పసిమి. మెరుగు పెట్టిన బంగారంలా ఆమె శరీరం నిగనిగలాడుతున్నది. మెరమెరలు పోతున్నది. చేతులు గుండ్రంగా అందంగా ఉన్నాయి. పూర్వం బక్కపల్చగా ఉండేది. ఇప్పుడు కొంచెం ఒళ్ళు వచ్చింది అనుకొన్నాడతను.

ఎదుటి మనిషి తనవంక అలా చూడడం గమనించి కూడా తొలగిన పమిట సవరించుకోలే దామె. నిండుగా, ఎత్తుగా ఆకర్షణీయమైన ఆకృతి సంతరించుకొన్న రొమ్ములు అతన్ని రెచ్చగొడుతున్నాయి. అప్రయత్నంగా అతను చేతులు ముందుకు చాచాడు. ఇంతలో నర్వరు స్ప్రింగ్ తలుపు రెక్కలు నెమ్మదిగా నెట్టుకొంటూ వచ్చి "కాఫీ తీసుకొని రానా?" అన్నాడు. "కొంచెం సేపాగి తేవచ్చునులే" అని ఆమె సమాధానం చెప్పింది. సర్వరు అవతలకు వెళ్ళగానే ఆమె నవ్వుతూ "ఏం అలా చూస్తున్నారు. ఇంకా కొత్తేనా? అది సరే అడగడం మరచాను. పెళ్ళి చేసుకొన్నారా!" అని అడిగింది. అతను మరోవైపు చూస్తూ "లేదు" అన్నాడు. అమె ముఖం గంభీరంగాపెట్టి "అహ, అల్లాగా అయితే పెండ్లికాలేదన్నమాట. ఆ అనుభవం కలగలేదన్నమాట. అందుకేనా ఏమిటి అయ్యోగారు నన్ను చూపులతో యిలా గుచ్చి వేధిస్తున్నారు మీ చూపులు తాకి కాబోలు నా సత్వశరీరం పులకరించిపోతున్నది. ఇది నాకు కొత్తగా, చాలా వింతగా ఉన్నదంటే మీరు నమ్మరు కదూ! అవును మరి నేనేం మడిగట్టుకొని కూర్చోలేదుగా. కాని నమ్మండి ఇది మాత్రం నిజం" అన్నది.

కొన్ని క్షణాల తర్వాత ఆమే లేచి వచ్చి అతని ప్రక్కగా కూర్చుని చనువుగా అతని చేతులు పట్టుకొని "ఏం అదేం. ఎందుకు చేసుకోలేదూ ? నామాత్రపు మనిషి దొరక్కపోయిందా? యింతకాలం మీ అమ్మా వాళ్ళు ఊరుకొన్నారా? వాళ్ళ సంగతి ఎలా ఉన్నా మీరు ఎలా ఊరుకోగలిగారు? పాపం ఎంత బాధ!" అంటూ ఎంతో నొచ్చుకున్నది. ఆమె నిజంగానే జాలిపడింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నన్ను ఒక్కరైనా యిలా బాధ పెట్టారనుకొన్నాను. మీరూ బాధపడ్డారా" అంటూ ఆమె చప్పున అతని భుజాలు పట్టుకొని నొక్కి, దగ్గరకు లాక్కొన్నది. అతని తల ఆమె రొమ్ములకు బలంగా తాకింది. ఆమె "అబ్బా" అంటూనే అతన్ని మరింత గట్టిగా హత్తుకొన్నది.

"ఉండు సర్వెంటు వస్తాడేమో" అని అతను కొంచెం దూరంగా జరిగి పంకజం నువ్వు ఇలా దగ్గరగా ఉంటే నాకు వళ్ళు తెలియకుండా పోతున్నది. ఏదో మైకం వస్తున్నది...." అన్నాడు. అందుకు ఆమె నవ్వుతూ "అలాగే "అంటూ అతనిపైకి ముందుకు వంగి, అతని చెంపలు రెండు అర చేతులతో నొక్కి, పెదిమలపై ముద్దు పెట్టుకోబోయి "అదేమిటి ఏదో ఔషధం సేవించిన వాసన వస్తున్నదేం? మీవంటి విద్యావంతులు సంస్కారం కలవాళ్ళు అందులో ఒట్టి నాజూకు మనుష్యులు ఇలా చేస్తారా? ఆ తెలియక అడుగుతున్నాలెండి. తప్పు కదూ? చెడిపోరూ?" అన్నది.

"అబ్బే అలవాటు కాలేదు. బొంబాయి మిత్రుల బలవంతం మీద స్వల్పంగా...."అంటూ గొణిగాడతను ఆమె ఒక్కక్షణం అతని ముఖంలోకి పరీక్షగా చూచి "ఏం కాదు మీకు అలవాటు అయింది. ఆ తప్పు మీది. స్నేహితులది మాత్రం కాదు. అవునా?" అని నిగ్గదీసి అడిగింది. అతను నెమ్మదిగా "అవును. నిన్ను మరచిపోవడానికే ఈ మందు సేవిస్తున్నా. స్నేహితుల సలహా పాటించాను. కాని నేను సేవించేది చాలా ఖరీదైనది. అదీ స్వల్పంగా. అందుకే ఎవరూ అనుమానించలేదు. అది సరే, నీకెలా తెలిసింది? ఎలా కనిపెట్టావు?" అన్నాడు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.

ఆమె మరోవైపు చూస్తూ వెంటనే నిర్లక్ష్యంగా, యథాలాపంగా "స్వానుభవంవల్ల" అన్నది.

"ఛ ఛ ఏం మాటలవి! నేను అంత మాట అనలేదు. అదికాదు నా ఉద్దేశం...." అంటూ అతను నొచ్చుకొన్నాడు.

"నా ఉద్దేశం కూడా అది కాదు. నేను స్వయంగా చవిచూచానని అనలేదు. చూచిన వాళ్ళతో చూస్తున్న వాళ్ళతో సర్దుకొని పోతున్నా" అని నవ్వుతూనే అన్నా ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మాటలయితే అక్కడితో ఆగాయి కాని బాష్పభరితాలయిన కళ్ళు మాత్రం భావ ప్రకటన మానలేదు.

అతని మనసు పరి పరివిధాల పోయింది. అతను లోలోపల బాధ పడ్డాడు. ఆమె మాటలు అర్థం అవుతూనే ఉన్నాయి కాని వాస్తవాన్ని వాస్తవంగా స్వీకరించడానికి అతని మనసు సుతరామూ ఇష్టపడడం లేదు.

“పంకజం, ఏమిటీ మాటలు” అంటూ ఏదో చెప్పబోతుండగా “ర్వరువచ్చి కాఫీ, చల్లని పానీయం బల్లమీద పెట్టివెళ్ళాడు. అతడు కాఫీ తాగిగడం పూర్తికాగానే ఆమె లేచి నిలబడి “పదండి. ఇక వెళదాం. నాకు అవతల అర్జంటు పనిఉన్నది. ఇంతసేపూ ఆ మాటే మరచిపోయాను....” అని ఆగి, మరోక్షణం తర్వాత మరోవైపు చూస్తూ “నేను కన్పించగానే మీరు ఎంతో ఆవేశపడతారనీ, ఏమేమో చేస్తారనీ అనుకొన్నాను. నన్ను గురించి ఎన్నో సంగతులు అడుగుతారనుకొన్నాను. కాని అటువంటిదేమీ జరగలేదు. ఇదే రంగస్థలంపైనఐతే నటన అసహజంగా ఉన్నదంటారు పోనీండి, ఇలా అన్నానని కోపగించుకోకండి” అన్నది. అలా అంటూనే ఆమె ఆగది బయటకు వెళ్ళింది, బిల్లు తానే చెల్లించి వీధిగుమ్మంలో అతని కోసం ఆగింది. అతను దగ్గరకు రాగానే కావాలని చిరునవ్వు నవ్వుతూ సమరి సెలవు-ఆదిసరే ఉంటారా?” అన్నది.

“ఉంటాను. మనమేమీ మాట్లాడుకోలేదే. మళ్ళీ ఎక్కడ ఎప్పుడు నీ దర్శనం” అని అడిగాడతను ఆత్రంగా.

“రేపు ఇక్కడే ఇదేవేళ.... సరేనా?- సరే అనండి. రావాలి సుమా మరచిపోతారేమో! సరే నేను మట్టుకు వస్తాను....” అంటూ గబగబా రోడ్డు మీదకు వెళ్ళిపోయింది.

అతను అక్కడే నిలబడిపోయాడు. ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాడు. ఎంత ప్రయత్నించినా అడుగు ముందుకు సాగలేదు. కాని అప్రయత్నంగా, అనుకోకుండా ఆలోచనలు గతంలోకి సాగిపోయాయి.

* * *

రామారావుకు ఆ రోజు బి.ఏ. ఆఖరు పరీక్ష అయిపోయింది. బాగా వ్రాసినందుకు సంతోషించాడు. పది రూపాయలు జేబులో వేసుకొని సినిమాకు వెళ్ళాడు. ఆ తెలుగు సినిమా ఆ రోజే మొదలు. జనం రద్దీ ఎక్కువగా ఉన్నది.

పంకజం అక్కడ కన్పించింది. దేవకన్య తన ముందు ప్రత్యక్షం అయినట్లు అనిపించింది. అతనికి చిత్రంగా ఆమెతో పరిచయం అయింది. జనంలోకి చొరబడి టిక్కెట్లు సంపాదించడం సాధ్యమా అనుకొంటూ అతను దూరంగా నిలబడ్డాడు. క్రింది తరగతి టికెట్లు అయిపోయాయని కుర్చీకి వస్తే అక్కడా రద్దీగా ఉంటే ఏమిటి చెయ్యడమా అనుకొంటూ పంకజం అతనికి దగ్గరగా వెళ్ళి నిలబడింది. తను చూడనప్పుడు తనవంకే కన్నార్పకుండా చూస్తున్న అతనివంక ధైర్యంగా చూచి చిరునవ్వు నవ్వుతూ "నాక్కూడా ఓ టికెట్ తెచ్చిపెడుదురూ" అని ఆమె రెండు రూపాయలు ఇవ్వబోతే అతను "వద్దు. మీరే తీసుకొని రండి. మీరు వెళ్ళితే వాళ్ళు తొలగుతారు. ఆడవాళ్ళు ఇటువంటి పనులు సాధించగలరు. రండి" అంటూ ముందుకు దారితీశాడు. దారిలో పది రూపాయల నోటు ఆమె చేతికి ఇచ్చాడు. పది నిమిషాల తర్వాత ఆమె ఇచ్చిన టికెట్లు తీసుకొని "రండి" అంటూ హాలులోకి వెళ్ళి చివరగా రెండుసీట్లు ప్రక్కప్రక్కగా ఖాళీగా ఉన్నచోటుకు వెళ్ళి కూర్చున్నాడు.

ఆమె నెమ్మదిగా వెళ్ళి అతని ప్రక్కగా కూర్చున్నది. ఆట అయి బయటకు వచ్చాక ఆమె నవ్వుతూ "మీరు ఈ సినిమా మళ్ళీ చూడాలి. ఇంతసేపూ నావంకే చూస్తూ కూర్చున్నారు" అన్నది. అతను నవ్వి ఊరుకొన్నాడు. ఆమె రిక్షా ఎక్కుతున్నప్పుడు అతను నెమ్మదిగా "మళ్ళీ కన్పిస్తారా" అని అడిగితే ఆమె వెంటనే "ఏం చూస్తూ నిలబడతారా?" అన్నది నవ్వుతూ "అవును" అన్నాడు అతను కూడా నవ్వుతూ. అందుకు

ఆమె "అలా అయితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మా నాటకం రిహార్సల్సు జరుగుతున్న గదికి రేపు సాయంత్రం నాలుగింటికల్లా వచ్చేయండి. ఆరు గంటల దాకా చూస్తూ కూర్చోవచ్చు" అని, ఆగి ఎక్కడికి రావాలో గుర్తులు చెప్పి వెళ్ళింది.

ఆమెతో అలాఅయిన పరిచయం క్రమంగా దృఢపడింది. రోజూ ఆమె ఆ ఇంటికి వచ్చేది. అతను వెళ్ళి ముందు వసారాలో బల్లమీద ఆమెకు ఎదురుగా కూర్చునేవాడు. ఆనాటకంలో ఆమె పోర్షను చాలా తక్కువ. అదీ చివరలో. అందుకేఅక్కడ ఆమెనుఎవరూ అంతగా లెక్క చేసేవారు కాదు.

రామారావు సెలవులకు ఇంటికి వెళ్ళడం మానుకొని రోజూ ఆమె వెంట తిరగడం మొదలుపెట్టాడు. నాటకం రోజుదాకా ఉండమని ఆమె కోరింది. అతను సరే అన్నాడు.

ఆరోజున నాటకం అయ్యేసరికి ఒంటిగంట దాటింది. రంగు తుడుచుకొని వచ్చి పంకజం అతన్ని ఇంటిదాకా తోడురమ్మన్నది. "అదేమిటి మీ అమ్మ ఉన్నది కదా!" అని అతనంటే ఆమె నవ్వుతూ "ఇద్దరమూ ఆడవాళ్ళం కదా! మగవాడు తోడు ఉంటే మంచిదని రమ్మంటున్నా, రండి మీరు తోడు ఆమె నీడా. సరేనా? అన్నది.

అతను "సరే" అన్నాడు.

పంకజం తల్లి అతన్ని ఆపూటకు అక్కడే ఉండి పొమ్మన్నది' అతను ఒప్పుకున్నాడు. తెల్లవారి లేచాక ఆమె అతనికి సకల మర్యాదలూ చేసింది. అతను కాఫీ త్రాగడం అయ్యాక ఎదురుగా నిలబడి "రాత్రి నాటకం ఎలా ఉన్నది? మా పంకజం వేషం ఎలా ఉందని మీ అభిప్రాయం?" అంటూ ఎన్నో అడిగింది. అతను తలవంచుకొని అన్నింటికీ బాగుంది అని మాత్రమే సమాధానం చెప్పాడు. అందుకు ఆమె నిరుత్సాహపడింది.

కోపగించుకొన్నది. కొన్ని నిమిషాల తర్వాత "సరే పోనీండి. అవి ఎలా అయినా ఈ రంగంలో పైకి రావాలి. ఇంకా కొన్నాళ్ళదాకా అదిడబ్బు సంపాదించనక్కర్లేదు. మెట్రిక్ దాకా చదువుకొన్నది. కొంత కాలం భరత నాట్యం నేర్చుకొన్నది. కొద్దిగా సంగీతం కూడా అబ్బింది. నాలక్ష్యం అల్లా అది ఎలాగయినా ఎప్పటికైనా నాటకాలలో మంచి పేరు సంపాదించడమే. అదొక్కటే నా ఆశ. అందుకు మీరుకూడా సహాయం చేయండి. అలా అయితేనే మీతో స్నేహం చెయ్యనివ్వడం" అని చెప్పేసి ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

ఆ తర్వాత అరగంటకు గాని పంకజం ఆ ఛాయలకే రాలేదు. అతను వెళ్ళి పోతుండగా వచ్చి మళ్ళీ కాఫీ యిచ్చి ఆమె అతనితో కబుర్లు పెట్టుకున్నది.

అలా చాలాసార్లు జరిగింది.

రామారావు పంకజం తల్లి మెప్పు పొందాలని గట్టిగా ప్రయత్నించి ఒకటి రెండు నాటకాలలో చిన్న పాత్రలు ధరించడానికి అవకాశాలు కల్పించాడు. పంకజాన్ని సినిమాలకూ, నాటకాలకూ, షికార్లకూ తీసుకొని వెళ్ళాడు. ఖరీదైన వస్తువులు కొని బహుమతులుగా ఇచ్చాడు. అనేక విధాల ప్రయత్నించి ఆమెకు నటనయందు ఆసక్తి కలిగేలా చేశాడు. ఫలితంగా ఆమె ఉజ్జ్వల భవిష్యత్తు ఉన్న నటి అనిపించుకొన్నది.

ఆమెతో బాగా స్నేహం అయిన నెలరోజులకు అతను ధైర్యంచేసి తన మనసులో ఉన్న విషయం నెమ్మదిగా బయటపెట్టాడు.

"పంకజం, మనం పెండ్లి చేసుకొందాం నీకు ఇష్టమేనా?" అని అడిగాడు. ఆమె అందుకు సంతోషం పట్టలేక అతన్ని కౌగిలించుకొని, గట్టిగా ముద్దుపెట్టుకొని "ఎంత మంచిమాటలు అన్నారండీ" అన్నది.

అతను సంతోషపడుతూ "అయితే నన్ను చేసుకుంటావన్నమాటేగా?" అన్నాడు.

"అంత అదృష్టమా"

"ఎవరికి నాకేనా?"

"మీకేం మీరు గొప్పయింటి బిడ్డలు. చదువుకొన్నవారు. మంచి సంబంధాలు చాలా వస్తాయి. నాకంటె ఎంతో అందమైన పిల్లల్ని ఇంత కట్నం ఇచ్చి చేస్తామని చాలామందే వస్తారు. కాని మీరు నన్ను చేసుకుంటారా!" అని ఆగి, కొన్ని క్షణాల తర్వాత మరోవైపు చూస్తూ "నిజంగా నాకు, ఈ ఇంట పుట్టిన నాకు అంత అదృష్టమా?" అన్నది మళ్ళీ. "కాదు కాదు. నాకు అంత అదృష్టమా అను. నీఅంతటి సౌందర్యవతి నా ఆరాధ్యదైవం నాకు దక్కడం గొప్ప అదృష్టం. నాటకాలలో పైకి వస్తున్నావు. నెమ్మదిగా సినీతారవు అవుతావు. అందులో నాకు సందేహం లేదు. ...." అంటూ అతను ఇంకా ఏదో చెప్పబోతుంటే ఆమె అడ్డువచ్చి "అవన్నీ ఏవో ఆశలు. మా అమ్మ పోరు పడలేక కొంతా, మీరు ఏమన్నా అనుకొంటారేమోనని మరికొంతా- ఈ రంగంలోకి దిగాను. ముందుముందు ఏమవుతానో నాకు తెలియదు. భవిష్యత్తుకు సంబంధించి నాకు పెద్ద ఆశలూ లేవు. గట్టి నమ్మకమూ లేదు. అందువల్ల ఇదే గొప్ప అదృష్టమని అనుకొంటున్నా" అని కొన్ని నిమిషాల తర్వాత "నాకు పూర్తిగా ఇష్టమే అయితే పెళ్లి విషయం మా అమ్మను అడగవలసిందే పదండి మా అమ్మతో చెబుదాం" అని అతన్ని తన ఇంటికి తీసుకొనివెళ్లింది. తీరా ఆమె తల్లి ఎదుటకు వెళ్ళేసరికి అతను భయపడ్డాడు. కొన్ని నిమిషాలదాకా దిక్కులుచూస్తూ ఊరికే నిలబడితే పంకజం అతని వీపుమీద మునివేళ్లతో పొడుస్తూ "చెప్పండి ఫరవాలేదు చెప్పండి" అన్నది. అప్పటికీ అతను మాటాడలేకపోయాడు.

పరసీరుహం నవ్వుతూ "ఏమిటండీ మా అమ్మాయి చెప్పమంటున్నది? ఏదైనా క్రొత్త నాటకం ఉన్నదా? ఇక్కడకాక మరో ఊరు వెళ్ళాలా? ఫరవాలేదు పంపిస్తాను. నేనూ వస్తాను" అన్నది.

"అదికాదు. నేను పంకజాన్ని——" అతనుఆగిపోతే ఆవిడ అందుకొని "తెలిసిందతెండి అందుకే దాన్ని పైకి తీసుకొనిరావడానికి మీరుకూడా ప్రయత్నాలు చేస్తున్నారు. అది అలా వృద్ధిలోకి రావడానికి ఏంచేసినా నాకు అభ్యంతరంలేదు" అన్నది.

పంకజం అతన్ని మళ్లీ చేత్తో పొడిచింది.

"అదికాదండీ నేను పంకజాన్ని ప్రేమించాను. మేము పెండ్లి చేసుకొందామని నిర్ణయించుకొన్నాం" అన్నాడు అతను తడబడుతూ.

పరసీరుహం వెంటనే కోపంగా "ఏమిటేమిటీ? మా అమ్మాయిని పెండ్లిచేసుకొంటారా? అప్పుడే నిర్ణయాలుకూడా అయినాయా? ముందే చెబుతున్నా. వీల్లేదు. నాకు ఎంతమాత్రం ఇష్టంలేదు". అని క్షణం ఆగి కూతురువంకకు తిరిగి పెద్దగా "ఏమే ఏమిటిసంగతి? ఏం, ఏమన్నా అయిందా? నాకు తెలియకుండా వ్యవహారం సాగిస్తున్నావా? ఏమిటె మాట్లాడవేం?" అని గదమాయించింది. పంకజం ఆవిడదగ్గరకు వెళ్లి "లేదమ్మా లేదు. అటువంటిదేమీలేదు. ఇంతవరకు నువ్వుచెప్పినట్లే చేశాను. రిహార్సళ్ళలో అక్కడా ఎవరినీ అలా ఒంటిమీద చెయ్యి వెయ్యనియ్యలేదు. కొంటెతనం పోయినవాళ్లమీద కస్సుబుస్సు మంటూనేవున్నా. అందుకే వాళ్లు నిరాదరణగా చూస్తున్నారు. కాని ఈయనకు మొదటినుంచీ ఎంతో అభిమానం నేనంటే. నీ అనుమానాలకు ఆస్కారం లేదు. మేం వేరే ఏమీ ఎరగం." అని ఒక్క-క్షణం ఆగి "అన్నీ తెలిసీకూడా ఆయన నన్ను కట్నంలేకుండా పెండ్లి చేసుకొంటానంటున్నారు. నాకు ఇంత గొప్ప అదృష్టం కలిసివస్తుంటే నువ్వు

అడ్డుతగలడం బాదుందా? అసలు నీకిది న్యాయమేనా?" అన్నది. ఆమె తల్లి "నువ్వు ఇంక మాట్లాడకు. చిన్నపిల్లవు. చిన్నపిల్లలా ఉండు. నువ్వు నాటకాలలో బాగా పైకి రావాలి. ఆతర్వాత సినిమాలలో చేరి మంచి పేరు సంపాదించాలి. నేను ఎన్నో ఆశలు పెట్టుకొన్నాను ఆ మంచిరోజుకోసం ఎదురుచూస్తున్నా" అన్నది నెమ్మదిగా.

రామారావుకు మొదట ఆవిడకు ఏమని సమాధానం చెప్పాలో తోచలేదు. కొన్ని నిమిషాల తర్వాత గొంతు సవరించుకొని "పంకజం పైకి వస్తుందనే నేనూ ఆశిస్తున్నాను నేనూ అందుకు సహాయం చేస్తాను. మీరు మా వివాహానికి ఒప్పుకోండి" అన్నాడు. అందుకు సరసీరుహం వెంటనే "ఒప్పుకోను అదే వద్దు. నేను జీవితం కాచి వడపోశాను. మీరు నిజంగా అమాయకులే. పైగా చిన్నవయసు. జీవితానుభవం లేదు. ఇందాక కోపం వచ్చి ఏదో అన్నాను. ఏమీ అనుకోకండి. మీకు ఇష్టమైనా మీవాళ్ళు ఇందుకు ఎన్నటికీ ఒప్పుకోరు. ఒకవేళ ఎప్పటికైనా మరో గత్యంతరం లేక ఒప్పుకొన్నా పెండ్లి అయ్యాక కోడలు కొడుకుతో గుట్టుగా కాపురం చెయ్యాలనీ, సంతానం కనాలనీ కోరుకుంటారు కాని వీధికెక్కాలనీ, నాటకాలు వెయ్యాలనీ కోరుకోరు. చెడిపోతారేమోనని అడ్డుకోకుండా ఉండరు. ఈ రంగంలో బాగుపడడానికి ఎంత అవకాశం ఉన్నదో చెడిపోవడానికీ అంత అవకాశం ఉన్నది. వాస్తవానికి అది చెడిపోవడంకాదు నా దృష్టిలో. సరే. అది వేరే విషయం. కనుక వదిలేద్దాం. నా కూతురు నాటకాలలో వేషాలు వెయ్యడానికి మీవాళ్ళు ఒప్పుకోరు. తగాదాలు వస్తాయి. మీ జీవితాలు పాడైపోతాయి. మీరు ఇద్దరూ అన్నివిధాలా రభస పడతారు. ఇవన్నీ నాటకాలలో బాగుంటాయి కాని నిజ జీవితంలో బాగుండవు. కష్టాలు కొనితెచ్చుకోవద్దు. కావాలనీ సమస్యలు సృష్టించుకోవద్దు" అని కొన్ని నిమిషాలు మరోవైపు చూస్తూ ఊరికే ఉండిపోయి "నాసంగతి చూడండి.

అటు నాటకాలలోనూ పైకి రాలేదు. ఇటు వృత్తిలోనూ వృద్ధిలోకి రాలేదు. ఎందుకు? ఆనాడు వ్యామోహంలో పడి ఎదో ఆశపడి అయ్యన్న - పంకజం తండ్రిని పెండ్లి చేసుకోబట్టేగా! దీని సంగతి అంతే అవుతుంది" అన్నది బాధపడుతున్నట్లు నెమ్మదిగా.

ఆమె మాటలు జాగ్రత్తగా విన్న రామారావు కొన్ని నిమిషాలదాకా సమాధానం చెప్పలేకపోయాడు.

అతను ముందుకు వెళ్ళి ఆమెను బ్రతిమిలాడుతున్నట్లు "కాదండీ, అలాకాదు. అలా కానివ్వను. మీరు ఆ భయాలేమీ పెట్టుకోకండి" అన్నాడు. అందుకు ఆమె "నేను అఖరు మాట చెబుతున్నా. కావాలంటే ఉంచుకోండి. నేను అభ్యంతరం చెప్పను. అది నాటకాలలో పైకి రావడానికి మాతోపాటు మీరు కూడా కృషి చెయ్యండి. మీకు మోహం మొత్తాక విడిచేసి వెళ్ళండి అంతే, పెండ్లిమాట మాత్రం ఎత్తకండి. నాకూతురును మీరు పెండ్లాడితే మీవాళ్ళు నామీద విరుచుకొని పడతారు. నన్ను అల్లరి పెడతారు భయపెడతారు. అటువంటివి నాకు గిట్టవు. ఏదో ఇలా గుట్టుగా, సుఖంగా గడిచి పోనివ్వండి. సరేనా?" అన్నది.

అతను మారు మాటాడకుండా తలవంచుకొని, కోపంగా చరచరా వీధిలోకి వెళ్ళిపోయాడు. పంకజం వీధిగుమ్మందాకా వెళ్ళి తల్లి పిలుపువిని ఆగిపోయింది.

రామారావు తన గదికి వెళ్ళి లోపల గడియ పెట్టుకున్నాడు. అతనికి కోపం వచ్చింది. అలిగాడు. గదిలో కాలుకాలిన పిల్లిలా అటూఇటూ తిరిగాడు. కాళ్ళు నొప్పులు పుట్టాక పక్క పరచుకొని పడుకొన్నాడు. అతను ఆపూట భోజనం చెయ్యలేదు. గదికి క్యారేజి తెచ్చి ఇచ్చే మనిషి అకన్న అన్నం అంతా ఎందుకు మిగిలించావని అడిగింది. అతను ఒంటిలో

బాగా లేదన్నాడు. ఆ మరునాడు మనసు బాగా లేదన్నాడు. అతను పది రోజులు గదివిడిచి బయటకు పోలేదు. ఉపవాసాలు చేశాడు. రాత్రింబవళ్ళు ఆమెను గురించే కలవరించాడు. ఆ విషయం తెలుసుకొని పంకజం అతన్ని ఆరోజు సాయంత్రం ఉద్యాన వనానికిరమ్మని కబురుపెట్టింది.

ఆమె అంచక్కా ముస్తాబయి, ఆభరణాలు ధరించి, పెండ్లికూతురులా వచ్చింది. చనువుగా అతనిదగ్గర కూర్చుని అనునయించింది. అంత కోపం దేనికని అడిగింది. అతను కోపం ఏమీలేదని చెప్పాక ఆమె నెమ్మదిగా "నామూలంగా మీకు ఈ బాధ కలిగింది. చాలా బాధ పడుతున్నారు. నేను మా అమ్మను ఒప్పించడానికి విశ్వప్రయత్నం చేశాను. కాని ఆమె పట్టు విడవడం లేదు, పోనీ మీరైనా నామాట వింటారా?" అన్నది.

"ఆ"

"మీరు నన్ను మరచిపోండి. మన స్నేహం విషయం ఇక్కడితో మరచిపోయి మీరు హాయిగా ఇంటికి వెళ్ళండి."

"అది అసంభవం. నిన్ను మరచి పోవడం అసంభవం. కళ్ళు తెరచినా కళ్లు మూసుకున్నా నువ్వే కన్పిస్తున్నావు. నీ సౌందర్యాన్ని ఆరాధిస్తున్నా. ఎవరు ఏమనుకొన్నా సరే-ఎవరు ఏమన్నా సరే. నాకు నువ్వు కావాలి."

"అయితే నన్ను లేవదీసుకొని వెళ్లండి వచ్చేస్తాను. ఎన్నాళ్ల పిలుంటే అన్నాళ్లు ఉంటాను. మీరు పొమ్మన్నప్పుడు మీకు పిలుకానప్పుడు ఇంటికివచ్చేస్తాను. మా అమ్మ తిట్టినా, కొట్టినా పరవాలేదు. భరిస్తాను. నేను ఈ పళంగా వస్తాను. ఇవాళ నేను పెట్టుకొని వచ్చిన ఈనగలు బంగారపువి. అవసరమైతే అమ్మి ఆ డబ్బు వాడుకొందాం. కొన్ని నెలలు మనం హాయిగా స్వేచ్ఛగా గడుపుదాం. ఆ తర్వాత మీరు ఏదైనా మార్గం చూడండి, మీకూ నాకూ"

రామారావు ముఖంమీద చేతులు కప్పుకొన్నాడు, "అదేమిటి ఆడపిల్లలాగా" అని ఆగిపోయి ఆమె తన పమిట కొంగుతో అతని కళ్ళనీళ్ళు తుడిచి "అంత కష్టం కలిగించేమాట నేను ఏమన్నాను?" అని మళ్ళీమళ్ళీ అడిగింది. "నేను అంత నీచుణ్ణి అనుకొన్నావా?" అని మాత్రమే అనగలిగాడతను అతి కష్టం మీద.

"ఇందులో నీచత్వం ఏమున్నదీ? అనుభవం ఇద్దరిదీకదా? మీ ఉద్దేశం లేచిపోయిన వాళ్ళంతా నీచులనా? ఏం కాదు. మన ఇద్దరికీ ఇష్టమైనప్పుడు తప్పులేదు. పదండి. వెళ్ళిపోదాం. తర్వాత తెలిసి, మనలను సరిగా అర్థంచేసుకొని మీవాళ్లు ఒప్పుకొంటే పెండ్లి చేసుకోవచ్చు."

"మా అమ్మా నాన్నా ఆలా ఎన్నటికీ ఒప్పుకోరు. ఇక్కడే మన పెళ్లి జరిగితే కొన్నాళ్లు పోయ్యాక మరి వేరే ఏమీ చెయ్యలేరు కనుక వాళ్లు ఊరుకొంటారు."

"అలాగా. అయితే మనం ఇక్కడ రహస్యంగా పెళ్ళి చేసుకుందాం."

"అబ్బే అది కుదిరేపని కాదు. మీ వాళ్లు ఎవరైనా వచ్చి పట్టుకొంటారు. అల్లరి పెడతారు."

"అబ్బబ్బ మీకు అన్నీ భయాలే. అవ్వా కావాలి బువ్వా కావాలి. మరీ చిన్న పిల్లవాడిలా మాట్లాడుతున్నారు. పెళ్లి పెళ్లి అని కలవరిస్తున్నారు. నా వాళ్లూ మీవాళ్లూ ఇంకా ఊళ్లో పదిమందీ అంగీకరించి చేస్తే పెండ్లి చేసుకుంటారు. లేకపోతే మీరు ఇలా బాధపడుతూ, నన్ను బాధ పెడుతూ కూర్చుంటారు. అవునా? మీసంగతి నాకేం అర్థం కావడంలేదు" అంటూ నెమ్మదిగా లేచి అతనికి ఎదురుగా నిలబడి భుజాలమీద చేతులు వేసి ముఖంలో ముఖం పెట్టి నవ్వుతూ "మీరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నారా?" అని అడిగింది.

"అవును"

"ముమ్మాటికీ నిజంగానా, గాఢంగానా"

"అవును"

ఆమె ముందుకు వంగి చప్పున అతని బుగ్గలమీద గట్టిగా ముద్దు పెట్టుకొని "ఇంత గాఢంగానా?" అన్నది.

"అంతకంటె ఎక్కువగా. కాని నువ్వు ఇలా రెచ్చగొట్టకు. తర్వాత ఏంచేస్తానో నాకే తెలియదు-నిన్ను" అని ఆగాడు.

పంకజం నవ్వుతూ "ఏం ఆగిపోయారేం? చెప్పండి. ఎవరుమాత్రం ఏంచేస్తారేమిటి?" అని అడిగింది. అతను ఆవేశంతో నిలువునా చలించిపోయాడు. ఆమెను గాఢంగా కౌగిలించుకోవాలని అనిపించింది. చప్పున లేచి ఆమె రెండు చేతులు పట్టుకొన్నాడు. ఆమె కిలకిలా నవ్వింది. ఆమె ముఖంలోకి చూచాడు. ఆమె అమాయకత్వం అర్థం అయింది. అంతలోనే తన పరిస్థితి తెలిసి వచ్చింది. ఆమెవంక కొరకొరా చూచాడు. ఆమె భయం నటించి చేతులు విడిపించుకొని ఎదురుగా నిలబడి అతని వంకే అలా గోముగా చూస్తూ "ఇంతకుముందు ఎక్కడో చదివితే నాకు అర్థం కాలేదు. నన్ను ప్రేమించే వ్యక్తి ఇలా ఆరాధించే వ్యక్తి ఒకరు ఉన్నారని తెలిసినప్పటినుంచీ నాకు ఏమిటో గర్వంగా, సంతోషంగా, తృప్తిగా, క్రొత్తగా ఉంటోంది. ఎంతో ఉత్సాహం కలుగుతున్నది. ఆ ఆలోచనే నాకు క్రొత్త ఊపు ఇస్తున్నది. ఆస్థితి అనుభవించవలసిందేకాని మాటలలో వ్యక్తీకరించలేక పోతున్నాను" ఆగి కొన్ని క్షణాలు ఆగి కొంచెం పెద్దగా "ఇప్పుడు మీరంటే నాకు భక్తి ఏర్పడింది. మీరు ఏమి చెయ్యమన్నా చేస్తాను. ఏటిలో దూకమన్నా దూకడానికి సిద్ధమే. మీరు ఈ పదిరోజులుగా

తన్పించకపోతే నాకు నిజంగా ఎందులో అయినా దూకుదామనే అనిపించింది" అన్నది.

రామారావు చప్పున ఆమెనోరు కుడిచేతితో కప్పి, ఎడమ చేతితో ఆమె వీపు నిమురుతూ "పంకజం అలా అనకు నువ్వు ఏ అఘాయిత్యము చెయ్యకు. ఎప్పటికైనా నేను అనుకొన్నది, సాధిస్తాను. నేను నిన్ను తప్ప మరొకర్ని పెండ్లి చేసుకోను. ఒట్టు" అని ఆమె చేతిలో చెయ్యి వేసి వాగ్దానం చేశాడు.

ఆమె తలవంచుకొని కొన్ని నిమిషాలు అలానిలబడి ఉండిపోయింది. తర్వాత నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ ఆ ఉద్యానవనం బయటకు వచ్చింది. ఆమె రిక్షా ఎక్కుతుండగా అతను "నువ్వు మరోలా అనుకోవద్దు. నిన్ను ఇలా తీసుగొని వెళితే తప్పు అంతా నాదే అవుతుంది. అందుకు నామనసు ఒప్పడంలేదు. రేపు వచ్చి మళ్ళీ మీ అమ్మతో అన్నీ మాట్లాడతాను" అన్నాడు.

ఆమె అతని మాటలు అంతగా పట్టించుకోలేదు. ఊరికేవిన్నది. అప్పుడేకాదు. ఆ మరునాడు ఆ తర్వాత చాలాసార్లు ఇంటికి వచ్చి తల్లినీ, తన్నూ బ్రతిమిలాడినప్పుడు కూడా ఆమె అతని మాటలు పట్టించుకోలేదు. చివరకు ఒకరోజు ఆమె తల్లి విసుక్కొని "మీరిలా గొడవచేస్తేట్టయితే ఇంక మా గుమ్మం త్రొక్కవద్దు. పంకజం మాట ఎత్తవద్దు. ఆఖరి మాటచెబుతున్నా. మీరు ఇలా మరోసారి వచ్చారంటే అందరితో చెప్పిఅల్లరిపెట్టేస్తాను. వెళ్లండి" అని భయపెట్టి అతన్ని బయటకు పంపించి వేసింది.

అతను ఆపూటే ఆ వూరు విడిచి స్వగ్రామం వెళ్ళాడు.

రామారావు ఇంటి దగ్గరే ఉండిపోయాడు. తండ్రి ఎంత చెప్పినా అతను పైచదువులకూ వెళ్ళలేదు. ఏ ఉద్యోగానికీ ప్రయత్నమూ చేయ్యలేదు. అతను బాగా దిగులుగా ఉండడం గమనించి అతన్ని అందుకు కారణమేమిటని అతని తల్లిఅడిగింది. ఏమీ లేదన్నాడతను. కొడుక్కు మంచి సంబంధం చూచి పెండ్లిచేస్తే ఆ దిగులు పోతుందని ఆమెఅనుకొన్నది. ఆప్రయత్నం చేసింది. వచ్చిన ప్రతిసంబంధం కాదన్నాడతను. పోనీ ఎవర్ని చేసుకొంటావో చెప్పు అని పోరు పెడితే అతను జరిగిన విషయం చెప్పాడు. ఆమెనెత్తి బాదుకొన్నది. తొందరపడి ఎన్నోఅన్నది. ఏమైనాసరే ఆ పిల్ల విషయం మరచి పొమ్మన్నది. ఇంటి బాధ్యతలు అతని నెత్తిమీద పెట్టింది. ప్రతిరోజూ పొలం పంపించింది. అతనికాపనులు క్రమంగా అలవాటు అయ్యాయి.

అలా అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి.

రామారావు మేనమామ కొడుకువచ్చి వ్యాపారంలో భాగస్వామిగా చేర్చుకుంటాను రమ్మంటే బొంబాయి వెళ్లాడు. అతని తల్లి అందుకు ప్రోత్సహించింది. తను అనుకొన్న ప్రకారం అతనిలో మార్పు వచ్చినందుకు ఆమె సంతోషించింది. అలా వెళ్లినవాడు మళ్ళీ అయిదు సంవత్సరాలదాకా స్వగ్రామానికే తిరిగి రాలేదతను.

అతను వ్యాపారంలో ప్రయోజకుడు అయ్యాడు. అతని దిగులు పోగొట్టడానికి అతని మిత్రులుకూడా అనేక ప్రయత్నాలు చేశారు. మిత్రుల సలహాపై అతను మద్యం సేవించడం కూడా అలవాటు చేసుకున్నాడు.

రామారావు చదువుకొన్న ఊళ్ళో ఆ వ్యాపార సంస్థ తాలూకు శాఖ పెట్టవలసివచ్చింది. తానే వెళతానని పట్టుపట్టాడు రామారావు.

"కాదు. నువ్వు మా చెల్లెన్ని చేసుకొని ఇక్కడే స్థిరపడు" అని అతని బావమరిదిఅంటే "కాదులే నేనేవెళ్ళాలి అక్కడ కొన్ని వ్యవహారాలు చక్క పెట్టుకోవాలి". అన్నాడు రామారావు.

అతను పంకజం విషయం తేల్చుకొందామనే ఆ ఊరు వచ్చాడు. అందుకే అక్కడకు వచ్చి రాగానే ఆమెను గురించి వాకబు చెయ్యడం మొదలు పెట్టాడు. కాని ఆ ప్రయత్నాలు వెంటనే ఫలించలేదు. ఊళ్లో ఎక్కడో కన్పించక పోతుందా అని తిరుగుతూ ఉండగా హఠాత్తుగా ఆమె కన్పించింది.

అరగంటసేపు తర్వాత అతను ఆలోచనలో నుంచి తెప్పరిల్లుకొని "ఆమె అన్ని విధాలా పైకి వచ్చిందల్లే ఉన్నది. నేను ఆమె కోసం ఆమె నాకోసం ఇలా ఇంత కాలం వేచి ఉండడం గొప్ప విశేషం" అనుకొంటూ సంతోషంతో పొంగిపోతూ అతను బసకు తిరిగి వెళ్ళాడు.

* * *

ఆ మరునాడు అతడు ఆ హోటలు దగ్గరకు వెళ్ళాడు, ఆమె వస్తానన్న సమయందాటి అరగంట అయింది. గంట అయింది. కాని ఆమెరాలేదు. "అయ్యో! ఆమెఎందుకు రాలేదో ఆమె ఇంటికివెళితే తెలియలేదు. ఉదయం అంతా అలాతిరిగాను. తీరా కన్పించినప్పుడు ఆవివరాలు తెలుసుకోలేదు. ఎవరినైనా అడుగుదామన్నా అప్పటి స్నేహితులలో ఒక్కరూ కన్పించలేదు. అప్పటి ఊరే పూర్తిగా మారిపోయింది. ఆ ఇంటికి వెళ్ళి అడిగినా ఆమెసంగతి ఏమీ తెలియదన్నారు అన్నివిషయాలు ఆమెనే అడుగలసింది కాని అడగలేదు పొరపాటు చేశాను. అనుకొని విసుక్కొన్నాడు. "నా దేవత కన్పిస్తె ఇటువంటివన్నీ అడగడం సాధ్యమా" అనుకొంటూ ముందుకు నడిచాడు. అలా అతను పది అడుగులు వేశాడో లేదో ఒక పెద్దకారు ప్రక్కగా దూసుకొని వెళ్ళి, ఆ

హోటలుముందు ఆగింది. అందులో నుంచి పంకజం ఆమెతోపాటు మరో క్రొత్త వ్యక్తి దిగడం రామారావు చూచాడు. కాని వాళ్ళు తన్ను చూడకుండా తప్పించుకొని ప్రక్కగా నడిచి వెళ్ళి కారుకు ఇటు ప్రక్కచాటుగా నిలబడ్డాడు వాళ్ళ మాటలు విన్పిస్తున్నాయి.

"ఇదుగో అడ్వాన్సు తీసుకోండి"

"వందేనా?"

"అందుకే అడ్వాన్సు అంటున్నా అక్కడ మిగతా డబ్బు ఇచ్చేస్తాను"

"సరే ఇక మీరు వెళ్ళండి. ఆయన చూస్తే బాగుండదు"

ఆమె ఆ నోటు చేతి సంచిలో భద్రపరచుకొని, రామారావు కోసం అటూ ఇటూ చూచింది.

"అయితే నేను మరో గంటపోయాక వస్తాను సరేనా" అన్నాడు ఆ కొత్తవ్యక్తి.

"సరే, సరే ఆ సంగతి తర్వాతచూద్దాం ముందు మీరు వెళ్ళండి. ఆయన వచ్చి లోపల నా కోసం ఎంత సేపుగాఎదురు చూస్తున్నారో ఏమో!" అంటూ అమె గబ గబా హోటలు లోపలకు వెళ్ళింది. ఆ కారు వెళ్ళిపోయిన రెండు మూడు నిముషాల తర్వాత అమె మళ్ళీ బయటకువచ్చింది. అప్పుడు వెళ్ళికన్పించాడు రామారావు.

"అదేమిటి నేనే ఆలస్యంగా వచ్చాననుకుంటే మీరు నా కంటె ఆలస్యంచేశారేం? బయట కన్పించకపోతే మీరు ముందుగా వచ్చిలోపల కూర్చున్నారేమో ననుకొని చూచివచ్చాను. అయితే ఇప్పుడే వచ్చారన్నమాట. రండిరండి" అంటూ నవ్వుతూ పంకజం అతన్ని లోపలకు తీసుకొనివెళ్లింది. క్రితం రోజునలాగా లోపల గదిలోకి వెళ్ళి కూర్చున్నది.

ఆమె ఎంతో పొంకంగా కూర్చున్నది. నిలువునా పూచిన పొన్నచెట్టులా ఉన్నది. చాలా ఖరీదైన బనారస్ పట్టుచీర కట్టింది. ఆచీర అంతా జరీయే. సరికొత్త నమూనాలతో చేయించిన ఆభరణాలు పెట్టుకొన్నది, ఆవేషధారణ, ఆ అలంకరణ, ఆ ఆభరణాలు, ఆదర్జా ఆ హుందా చూస్తే ఓ జమిందారిణిలా కన్పిస్తున్నది.

అతను ఆమె ఎదురుగా కూర్చుని అలా చూస్తూ, సర్వరు వచ్చి వెళ్ళేదాకా ఏమీ మాటాడలేదు.

“ఇందాక ఆ కారులో వచ్చి నాయన నీకు అంత డబ్బు ఇచ్చివెళ్ళాడు దేనికి” అని అడిగాడు రామారావు నెమ్మదిగా.

“అయితే ముందే వచ్చారన్నమాట! మరి చూడలేదా?”

“కన్పించారు.”

“మరి వినలేదా?” కొంచెం గట్టిగా అడిగింది పంకజం. అతను మారు మాటాడలేదు. అంతలో ఆమె సర్దుకొని స్వరం తగ్గించి “అది అడ్వాన్సు నన్ను ఆయన క్రొత్తనాటకంలో బుక్ చేశాడు” అన్నది అతన్ని తృప్తి పరచాలని ప్రయత్నిస్తూ.

“ఏం నాటకం?”

ఆమె వెంటనే ఏమీ మాటాడలేదు.

అతను మళ్ళీ అడగలేదు.

కొన్ని నిమిషాలు గడచి పోయాయి. అంతలో ఒక కుర్రవాడు నెమ్మదిగా తలుపునెట్టుకొని లోపలకు వచ్చి ఆమెతో ఏదో రహస్యంగా మాటాడి “మరి వెంటనే రండి. ఒక్కసారి వెళ్ళి కన్పించిరండి. ఆలస్యంచేస్తే తర్వాత మీరు నన్నే తిడతారు” అన్నాడు కొంచెం పెద్దగా.

పంకజం నెమ్మదిగా లేచి నిలబడి ఒంటినిండా పమిట కప్పుకొంటూ "మీరు నన్ను క్షమించాలి. నేను మళ్ళీ వెంటనే వచ్చేస్తాను. మీరు ఏమీ అనుకోకండి" అని గుమ్మందాకా వెళ్ళి, వెను తిరిగి అతన్ని చూచి నవ్వుతూ, పెద్దగా "పారిపోకండి సుమా" అన్నది.

పావు గంట తర్వాత ఆమె తిరిగి వచ్చింది. విసుక్కుంటూ కసురుకుంటూ వచ్చి కూర్చొని, మూత పెట్టి ఉంచిన ఫలహారం గబగబా తింటూ "ఏమిటో అన్ని పనులు ఇప్పుడే వచ్చి పడ్డాయ్. పోనీ వీళ్ళను ఇంటికి రమ్మందామా అంటే అది బొత్తిగా వీలుకాకుండా పోయె" అన్నది. ఖాళీ ప్లేటును ముందుకు నెడుతూ తల ఎత్తి ఒకసారి అతని వంక చూచి "అదేమిటి మీరసలు అవి ముట్టుకోలేదు. పైగా కాఫీకూడా త్రాగేసినట్లున్నారు" అంటూ ఏదో ఇంకా మాటాడబోయి, అతనికి కోపం వచ్చిందేమోనని భయపడి, వెంటనే తలవంచుకొన్నది. అతను ఆమె వంక పరిశీలనగా చూచాడు.

ఆమెలో ఏదో మార్పు ఉన్నట్లు అనుమానం కలిగింది. కాని వెంటనే అలా అనుమానించడం కూడా అసభ్యం అనిపించింది అతనికి. ఏమి మాటాడాలో తోచక, ఏమీ మాటాడకుండా ఉండలేక అయిదు నిముషాల తర్వాత అతను "పంకజం ఏమిటి అర్జంటు పని?" అని నెమ్మదిగా అడిగాడు. అందుకు ఆమె సమాధానం చెప్పలేదు. పైగా అతని మాటలు విన్పించనట్లు నటిస్తూ కొంచెం పెద్దగా "ఇక్కడ నృత్యనాటిక వెయ్యడం ఇదే ప్రథమం. దర్శకులు మద్రాసునుంచి వచ్చారు. ఆయన ఈ పూటే వెళ్ళిపోతున్నారు. కొన్నాళ్ళు పోయాక మళ్ళీవస్తారట" అన్నది.

ఆమె అతనివంక చూచింది అతను తల ఎత్తలేదు. తన మాటలు వినడంలేదని గ్రహించింది. అయిదు నిమిషాలదాకా ఏమీ మాటాడకుండా ఊరుకొన్నది.

అతను తల ఎత్తి ఆమెవంక చూచాడు. ఆమె వెంటనే "నాకు వేడి కాఫీ త్రాగాలని ఉన్నది. మీకు పుణ్యం ఉంటుంది. తెప్పించి ఇస్తారా?" అన్నది. అతను నెమ్మదిగా లేచి ఆగది బయటకు వెళ్ళాడు. అక్కడ సర్వరు కన్పించలేదు. కాని అంతకుముందు ఆ గదిలోకివచ్చి పంకజంతో రహస్యంగా మాటాడివెళ్ళిన కుర్రవాడు కన్పిస్తె దగ్గరకు పిల్చి నెమ్మదిగా "ఏ అమ్మగారికి వేడి కాఫీ కావాలట త్వరగా తెచ్చిస్తావా?" అని అడిగాడతను. అందుకు ఆ కుర్రవాడు నవ్వుతూ "నేను సర్వరును కాదండి. మేడ మీదగదుల దగ్గర ఉంటాను. ఎవరైనా పనులు చెబితే చేస్తుంటాను. అయినా కాఫీ పంపిస్తాలెండి. అది సరే కానిండి. మీకేమైనా ఫారిన్ బాటిల్సు కావాలండీ" అన్నాడు. వద్దు అని చెప్పి అతను మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళి ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు. ఆమె తల ఎత్తి అతనివంక అలా చూచింది. నవ్వింది.

మధుర మందహాసం దాని వెనుక అవ్యక్తమైన ఆవేదన.

అతను ఆమె కళ్ళవంక చూచాడు ఆమె కళ్ళతో నవ్వింది. ఆమె పెదిమలు నొక్కుకొన్నది. అంతలో ఆమె పెదిమలు వణికాయి ఆమె కోపంగా చూచింది. ఆ చూపులో అలసట, చిరాకు, అశాంతి వ్యక్తంచేసింది. ఏమి భావప్రకటనా సామర్థ్యం! అనుకొని అతను ఆశ్చర్య పడ్డాడు. అదిగమనించి ఆమె ఉత్సాహంతెచ్చుకొని నెమ్మదిగాలేచి వయారంగా నడిచివెళ్ళి వాష్‌బేసిన్‌లో చేతులు ముఖం కడుక్కొని అక్కడ ఉన్న తువ్వాలతో తుడుచుకొని అతని ప్రక్కగా వచ్చి నిలబడి "నేను నాటక రంగంలో పైకివచ్చాననన్న సంగతి మీకుతెలుసా? పేరుమార్చుకొన్నా-అందుకని అడుగుతున్నా. డాన్సు, సంగీతంకూడ రావడంవల్ల నాకు సినిమాలలోకూడా ఒకటి రెండు ఛాన్సులు వచ్చాయి. అక్కడే వుండిపోతే బాగా డబ్బు సంపాదించే అవకాశాలు కన్పించాయి. కాని ఇక్కడ ఉన్న భద్రత

అక్కడలేదు. అంతేకాదు. నటనకు ఇక్కడే ఎక్కువ అవకాశం ఉన్నది. దానికి తోడు మంచిస్వేచ్ఛ ఉన్నది. అందువల్ల నేను తిరిగివచ్చి నాటక రంగంలోనే స్థిరపడ్డాను. అయితే అందువల్ల నేను నష్టపడలేదు, సినిమా నటి అన్న మోజుకూడా ఉన్నది కనుక మంచి బుకింగులు వస్తున్నాయి. నా సంపాదన బాగానే ఉన్నది. కొన్నాళ్లక్రిందట మేము వేరే మంచి ఇల్లు కొన్నాము. మా నాన్న దుర్వ్యసనాలన్నీ పూర్తిగా మానేశాడు. నాకు అన్నివిధాలా అండగా ఉంటున్నాడు. మా అమ్మ జబ్బుపడి ఇంట్లోనే ఉంటున్నది. నాకు పూర్తి స్వేచ్ఛ లభించింది. కాని ఇప్పుడే నాకు బాధ్యతలు ఎక్కువ అయ్యాయి. క్షణం తీరిక ఉండడంలేదు. మీరు నమ్మరుగానీ....” అంటూ గబ గబా చెప్పుకుపోతూ మధ్యలో ఆగి, చప్పున స్వరం పెంచి “మీకు నా సొంత విషయాలపట్ల ఏమీ ఆసక్తి లేనట్లున్నదే అవునా?” అని అడిగింది.

అతను ఏమీ మాటాడలేదు. కొన్ని క్షణాల తర్వాత ఆమె కుర్చీ లాక్కొని అతనికి బాగా దగ్గరగా కూర్చుని అతని చేతులు పట్టుకొని “ఇవన్నీ ఎందుకు గానీండి మీకు నేనంటే పూర్వపు ప్రేమ- అభిమానం పోనీ జాలి, దయ ఏమైనా మిగిలి ఉన్నాయా?” అని దీనంగా అడిగింది. అతను సమాధానం చెప్పబోయాడు. కాని గొంతుకు ఏదో అడ్డంపడినట్లు అనిపించింది. ఎంత ప్రయత్నించినా మాట పెకిలి రాలేదు. అంతలో ఆమె మళ్ళీ “అవును మరి ఎందుకుంటాయి. మీకు నేను ఎవర్ని కనుక” అంటూ చేతులు విదిలించి కోపంగా” నన్ను మీరు మరచిపోయారు. ఇన్నాళ్లకు ఏదో సన్నించాను కనుక పిలిచారు. నేను లాక్కొనివస్తే ఇక్కడకు వచ్చారు. నాతో ఇలా ఒంటరిగా కూర్చుని మాట్లాడడమే మీకు బాధగా నామర్దాగా వున్నదికాబోలు?” అన్నది సాధిస్తూ. అంతలో ఆమె ఆవేశపడ్డది. రొప్పు వచ్చింది. పెదిమలు ఈదురుగాలిలో రావిఆకుల్లా వణికాయి. ఆమె

కొన్ని క్షణాలు మాటాడడం మానివేసింది. పొంగి వస్తున్న దుఃఖం ఆపుకొన్నది.

"అలా అని ఎవరన్నారు?" అనిమాత్రమే అనగలిగాడతను అతి ప్రయత్నంమీద. తన ప్రేమ, అభిమానం ఆవగింజంతకూడా తగ్గలేదనీ, తన పూర్వపు నిర్ణయం మారలేదనీ, అసలు అందుకే తాను బొంబాయినుంచి అక్కడకు వచ్చాననీ వివరంగా చెబుదామని గట్టిగా అనుకొన్నాడు. కాని వెంటనే ఒక్కమాట కూడా చెప్పలేకపోయాడు. ఆమె మరీ దగ్గరగా కూర్చున్నది. ఆమె శరీర స్పర్శ అతనికి క్రొత్తగా, వింతగా ఉన్నది. క్షణక్షణం ఆవేశం వస్తున్నది. కొన్ని క్షణాల తర్వాత ఆమె అతని భుజంమీద చెయ్యి వేసి మృదువుగా నొక్కుతూ నెమ్మదిగా "నేను నిజం చెప్పేస్తాను. ఏమీ దాచకుండా అంతా చెబుతాను. నన్ను స్వీకరిస్తారా? బురదలో పుట్టి పెరిగిన ఈ పంకజాన్ని స్వీకరిస్తారా? - నన్ను - అన్నీ ఉండి ఏమీ లేనిదానిలా ఇన్ని బాధలు పడుతూ- అందరూ ఉండి, ఎవరూ లేనిదానిలాగా ఏకాకిగా గడిపిన నన్ను భార్యగా చిన్నప్పుడే తాళి గట్టిన భార్యగా పరిగణించి ఆదరిస్తారా?" అని అడిగింది. మళ్ళీ అంతలోనే ఆవేశపడిపోతూ పెద్దగా అరుస్తున్నట్లుగా "ఏం ఏమి మాట్లాడరేమండి నా మీద అంత కోపంగా ఉంటే పోనీ తిట్టండి. కొట్టండి. జుట్టు పట్టుకొని ఈడ్చుకొని వెళ్ళి ఏ నదిలో అయినా ముంచండి. ఏం చెయ్యడానికి అయినా మీకు ఒక్కరికే అటువంటి అధికారం ఉన్నది. కాని-కాని" అని ఆగిపోయి ఒక్క క్షణం అతని కళ్ళలోకి పిచ్చిదానిలాగా దీనంగా, జాలిగా చూస్తు, అరచేతితో నోరు కప్పుకుంటూ "ఎంతయిదయితే మాత్రం నన్ను విడిచిపెట్టి పోతారటండీ ఇది న్యాయమేనా? నేనేమైపోవాలనుకన్నారు" అన్నది. అంతలో ఆమెకు దుఃఖం పొర్లి వచ్చింది. మరుక్షణంలో ఆమె పెద్దగా వెక్కివెక్కి ఏడుస్తూ అతని ఒడిలోకి వాలి పోయింది. నిలువునా

చలించిపోతూ అతను ఆమె చెక్కిళ్లు, నుదురు స్పృశిస్తూ ఆమె కళ్లవంక చూచాడు. కళ్లు మూసుకొని పోయాయి. ఆమెకు స్పృహ తప్పింది.

ఆమె అలా అతని ఒడిలోకి ఒరిగి పోవడంలో బల్లమీద ఉన్న మంచి నీళ్ల గ్లాసులు దొర్లి క్రింద పడ్డాయి. ఆ చప్పుడు విన్పించి నశ్వరు పరుగెత్తుకుంటూ లోపలకువచ్చి పంకజం పరిస్థితి చూచి "ఏం జరిగింది ఏం జరిగింది" అంటూ గాబరాగా అడిగాడు. అందుకు రామారావు "ఏంలేదు ఆమెకు కాస్త తల తిరిగినట్లు అయింది. నేను చూస్తాన్లే నువ్వువెళ్లు" అన్నాడు.

ముఖం మీద నీళ్లు చిలకరించి చల్లని నీళ్లలో ముంచి, పిండిన చేతి రుమాలుతో ముఖం చాలా సార్లు తుడిచాక ఆమె నెమ్మదిగా కళ్లు తెరచింది. రెండు మూడు నిముషాల తర్వాత ఆమె "నన్ను ఇలాగే ఉండిపోనివ్వక పోయారా" అంటూ లేచి కూర్చున్నది.

"ఇప్పుడెలా ఉన్నది? కాసేపు విశ్రాంతిగా కూర్చో. కాఫీ త్రాగితే కాస్త ఓపిక వస్తుంది". అంటూ ఆదుర్దా పడుతూ, వీపు నిమురబోతే, ఆమె చప్పున లేచినిలబడి "ఏమీ అక్కర్లేదు ఇప్పుడునాకు బాగానే వున్నది. ఇంకలేవండి వెళదాం" అన్నది కొన్ని క్షణాలు ఆగి ఆమెనవ్వుతూ "మరి లేవండి తెరపడేవేళ అయింది. త్వరగా నడవండి" అన్నది నెమ్మదిగా రహస్యంగా అంటున్నట్లు.

ఆమె ముందు వెళ్ళింది. ఆ గది గుమ్మందాకా చాలా నెమ్మదిగా అడుగులు తేల్చివేస్తూ చప్పుడు కాకుండా చమత్కారంగా నడిచి వెళ్లింది. మళ్ళీ మళ్ళీ వెనుతిరిగి చూస్తూ వెళ్లింది. రంగస్థలం పైన అంతసేపు అద్భుతంగా నటించి రసపరిప్లుత హృదయులైన సభికులను మంత్ర

ముగ్ధలను కావించి నిష్క్రమిస్తున్న నటీమణిలా నడిచి వెళ్లింది. అతను ఆమె వంక అలా కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డాడు.

ఆ గది గుమ్మం అవతల కాఫీ కప్పు బిల్లు పుచ్చుకొని నిలబడిన సర్వరుతో ఆమె "కాఫీ అక్కర్లేదు. ఇదుగో డబ్బు. బిల్లు చెల్లించి మిగిలింది నువ్వు తీసుకో" అన్నది. "ఏదో ఘర్షణ పడినట్లున్నారు ఏమిటి ? ఇంతకు అసలు ఆయన ఎవరు?" అని ఆ సర్వరు ఆ గది గుమ్మం అవతల తలుపు తెరుచుకొని నిలబడిన రామారావును వేలుతో చూపుతూ చాలా నెమ్మదిగా అడిగితే, ఆమె నవ్వుతూ పెద్దగా" అంత భయపడక్కర్లేదు. మీతో ఎవరితో తగూకువచ్చే మనిషికాదాయన. ఎప్పుడూ చూడలేదు కనుక అడిగావు, తప్పేముంది" అని క్షణం ఆగి మళ్లీ అంతలో "ఆయన నాభర్త. బొంబాయిలో పెద్దవ్యాపారం చేస్తున్నారు, ఇక్కడ ఘర్షణ పడింది అల్లరి పెట్టింది నేను, ఆయన కాదు. ఇక్కడ మీ అందరకి నా సంగతీ నా స్వభావం తెలుసు కనుక అనుమానాలు లేవు. ఆయన అనుమాన పడడం సహజం. అందువల్ల ఏదో ఘర్షణ పడవలసి వచ్చింది సరే నువ్వింక మాట్లాడకు, ఏం తెలిసిందా ?" అంటూ గబ గబా బయటకు వెళ్లింది. దించిన తల ఎత్తకుండా రామారావు ఆమెను అనుసరించాడు.

హోటలు బయటకు వచ్చాక అతను ఆమె ముందు అడ్డుగా నిలబడి నెమ్మదిగా "మనం నాగదికి వెళదాం" అన్నాడు. అందుకు ఆమె మరోవైపు చూస్తూ "మీరు మీ గదికి వెళ్లండి నన్ను నా దారిన పోనీయండి" అన్నది.

రామారావు ఆమె చెయ్యి పట్టుకొని ప్రతిమిలాడుతూ "అలా కాదు పంకజం" అన్నాడు. ఆమె నవ్వుతూ "ఏం నన్ను ఎత్తుకొని వెళతారా లేవదీసుకొని వెళతారా ?" అని ఆగి స్వరం తగ్గించి "మీకిప్పుడు ఇష్టమైనా, అంత ధైర్యం వచ్చినా, నేను రాను, రాలేను. అదీకాదు అలావస్తె మీ విషయంలో అధర్మం చేసినట్లు అవుతుంది. ఆనాడు పది సంవత్సరాల క్రితం మీరు నన్ను ఏం ప్రేమించారో ఏమో గాని, నేను మాత్రం మిమ్మల్ని గాఢంగా మనసా, వాచా, ప్రేమించాను. అది నిజం. ఇదుగో వీటి సాక్షిగా చెబుతున్నా" అని మెళ్లో మంగళసూత్రాలు తీసి చూపింది.

అతను ఆశ్చర్య పడుతూ ఆమె వంక అలా చూస్తూ ఆభరణాల మధ్య ఉన్నా అంత స్పష్టంగా కన్పిస్తున్న మంగళసూత్రాలను నేను గమనించలేదే ! అనుకొన్నాడు.

"ఇవి నాటకాలలో వచ్చిన స్వర్ణ పతకాలు మార్పించి చేయించు కొన్నాను. మీకు గుర్తుగా మీ ప్రేమకు, అభిమానానికి చిహ్నంగా ఇవి మెడలో ధరించాను. మీరు అప్పటి సమస్యలనుంచి తప్పించు కోడానికి ఇక్కడనుంచి పారిపోయారు. అంతకంటె అన్యాయం ఏమంటే నన్ను మరచిపోవడానికి ప్రయత్నించారు. కాని నేను అలా చెయ్యలేదు. అన్ని సమస్యలనూ ఎదుర్కొన్నాను. నేను మిమ్మల్ని ప్రేమించిన విషయం నా తల్లి తండ్రులకే కాదు అందరికీ నేనే బాహాటంగా చెప్పుకొన్నాను మీ వియోగంతో వేగిపోయాను. ఇంకా వస్తారు. ఇంకా వస్తారని అనుక్షణం ఎదురు చూచాను. ఎన్నో ఆశలు పెంచుకొన్నాను. మీరుతిరిగి వచ్చేలోపల ఎందుకైనా మంచిదని. మీరు నన్ను స్వీకరించడానికి ఇంకా ఎక్కువ అర్హత సంపాదించాలని, ఎన్నో విధాల తాపత్రయపడ్డాను. కేవలం మిమ్మల్ని సంతోషపెడదామని నాటక కళను గురించిన పుస్తకాలు

కష్టపడి చదివాను. అనుభవం సంపాదించాను ఇదంతా కేవలం మీకోసం. మీరు ఏ క్షణంలో అయినా తిరిగివచ్చి, నన్ను గురించి విచారించి కూడా ఏ విధమైన నేరం, దోషం ఆరోపించడానికి వీలులేకుండా జాగ్రత్తగా మసలుకొన్నాను. ప్రేమించామంటూ నావెంటపడిన వాళ్లను అందరినీ నిరాకరించాను. ఇంత చేసినా, ఏళ్లు గడచిపోయినా మీరు రాలేదు. అక్కడ ఎలా ఉండిపోయారా అని ఆశ్చర్యపడ్డాను. ఎందుకు ఉండిపోయారా అని అనుమానపడ్డాను. నిరాశా నిస్పృహలకు లోనయ్యాను. వెర్రిదాన్నయ్యాను. మానసికంగా కృంగిపోయాను. కృశించిపోయాను మా అమ్మతో సహా లోకం నన్ను చూచి అపహసించింది. అపార్థం చేసుకొన్నది. కాని మా నాన్న ఒక్కడే నా పరిస్థితి సరిగా తెలుసుకొన్నారు. నన్ను పూర్తిగా అర్థం చేసుకొన్నారు. ఆదుకొన్నారు. కాపాడారు. నాటకరంగానికి పునరంకితం చేసుకొనేలా చేసారు. ఆయిదారు సంవత్సరాలుగా మీ విషయం అప్పుడప్పుడు విచారిస్తున్నాను. మీ క్షేమసమాచారాలు తెలుస్తూనే ఉన్నాయి. ఒకనాడు మీరు బొంబాయి వెళ్ళారని తెలిసింది. ఆరోజునుంచి మరో క్రొత్తరకం ఆశలు పెంచుకొన్నాను, స్వగ్రామానికి దూరం కనక మీరు వ్యాపారంలో స్థిరపడ్డారు కనక ఇక వచ్చి నన్ను తీసుకొని వెళ్ళి కాపురం పెడతారని కలలు కన్నాను. కాని మీరు రానే లేదు. నేను ఎప్పుడూ మీ మేలే కోరాను. ప్రేమ త్యాగం కోరుతుంది, నేను మీ ముందుకు రాకపోవడమే, నా సుఖం, నాస్వార్థం వదులు కోవడమే నా త్యాగం. ఇప్పటికైనా నన్ను అర్థంచేసుకోండి. వాసూ అంతే చాలు" అని కొన్ని క్షణాలు ఆగి, ఊపిరి పీల్చుకొని నీరు నిండిన కళ్లు పమిటకొంగుతో గట్టిగా ఒత్తుకొని, అప్పుడే ఆ వీధిలోకి, ఆ హోటలు ముందుకు వస్తున్న పెద్ద కారువంక చూచి, అందులో ఉన్న వ్యక్తిని అక్కడే ఉండమంటున్నట్లు చేత్తో సంజ్ఞలు చేసింది, కొన్ని నిమిషాల తర్వాత ఆమె మళ్లీ అతని

ముఖంలోనికి చూస్తూ "నన్ను మరచిపోవడానికి కదూ మీరు మద్యపానం అలవాటు చేసుకొన్నారు? ఏం, నేనేం మహాపాపం చేశానని నన్ను మరచి పోవడాకి ప్రయత్నించారండీ?" అని అడిగింది.

కొన్ని క్షణాల తర్వాత ఆమె కొంచెం పెద్దగా "ఇకనుంచి అయినా మానెయ్యండి. నామీద ఒట్టు. ఇక ఆ విషయం పూర్తిగా మరచిపొండి. మీరు మళ్ళీ బొంబాయి వెళ్ళిపొండి. అక్కడ మీ బావమరిదీ వాళ్ళు మిమ్మల్ని ఆదుకొంటారు. నేను మీవెంట వస్తే మీ జీవితం దెబ్బతిని పోతుంది. మీరు మంచి వారు, మెత్తని మనసు మీది. కేవలం నాజూకు మనుష్యులు మీరు. నేను మీవెంట ఉంటే మిమ్మల్ని అయిన వాళ్ళూ, కాని వాళ్ళూ అనే మాటలు సహించలేరు. పెట్టే బాధలు భరించలేరు. నేను ఇక్కడ మీకు దూరంగా ఆరాధిస్తుంటాను. అనుభవానికైతే ఇద్దరు కావాలి కాని ఆరాధనకు అక్కరలేదు. ఇప్పుడు కాకపోతే మరొకప్పుడు నేను మీదాన్ని కావాలని, అందుకు మీరు కోరేవిధంగా అందరి ఆశీస్సులు లభించాలని, మీకు ఆ గౌరవం, ఆ మర్యాద దక్కాలని ఆశిస్తు, కలలు కంటూ హృదయంలోనే మిమ్మల్ని ఆరాధిస్తు, పైకి మరోరకంగా నటిస్తు కాలం గడుపుతున్నాను. జీవితాన్ని స్వయంగా సరిదిద్దుకోడానికి ఎంతో విద్యా, సంస్కారం కావాలి, మంచి సంపద కావాలి, మంచి మద్దతు కావాలి. ముఖ్యంగా నన్ను సమంగా అర్థం చేసుకొన్న, మనసారా ప్రేమించిన మీలాంటివాళ్ళ అండదండలు మొదటినుంచి చివరిదాకా ఉండాలి. నాకు అంత అదృష్టం లేదు ఇంత జరిగాక మనం ఏం చేసీ ఏమీ లాభంలేదు. మిమల్ని నన్ను ఉద్ధరించమని కోరను. అది ఒకళ్ళవల్ల అయ్యేది కాదు. ఎప్పటికైనా నేను నమ్ముకొన్న కళామతల్లే నన్ను ఉద్ధరించాలి" అని అతని కళ్ళలోకి ఒకసారి దీనంగా మరొకసారి కోపంగా చూచింది.

ఆమె మొదట ఎందుకు దీనంగా చూచిందో అంతలో మళ్ళీ ఎందుకు కోపంగా చూచిందో అతనికి క్రమంగా కాని అర్థం కాలేదు "పంకజా"

అన్నాడతను పెద్దగా చాలా పెద్దగా. కాని ఆమె విన్పించుకోలేదు. కాదు ఆమెకు అసలు వినిపించలేదు.

దూరంగా ఆగి ఉన్న పెద్ద కారు దగ్గరకు ఆమె రామబాణంలాగా దూసుకొని వెళ్ళింది.

పెద్ద గాలి దుమారంలాగా వెళ్ళింది. అప్పటి వరకు సువిశాల నీలాకాశంలో వింత వింత ఒయ్యారాలు పోతూ తేలియాడుతున్న జల భరితమైన పెద్ద మేఘం, హఠాత్తుగా వీచిన ఝుంఝూమారుత ప్రసారంలో కొట్టుకొనిపోతూ, దాపున ఉన్న ఉత్తుంగ పర్వతాన్ని ఢీకొనడానికి వెళ్ళినట్లుగా తూలిపోతూనే అమితవేగంగా వెళ్ళింది.

గాలి వానకు సమూలంగా పెకలించి వేయబడిన లతానికుంజం పెనుసుడిగాలిలో చిక్కుకొని అలా గాలి గుమ్మటంలా తేలిపోతూ, కొట్టుకొని పోతున్నట్లు వెళ్ళింది.

తన గుండెకు హత్తుకొంటున్న పూలదండను, తన కన్నులకు ఒత్తుకొంటున్న పూల చెండును ఎవరో లాగి అవతలకు విసిరివేసినట్లు అనిపించింది రామారావుకు.

అతను దిగ్భ్రాంతిచెందాడు. విద్యుదాఘాతం తగిలినట్లు అనిపించింది. కొన్ని నిముషాల తర్వాత తెలివి వచ్చినట్లయింది, కను విప్పు కలిగింది. అన్నాళ్ళూ, తనకేమాత్రం తెలియకుండా ఉన్న తన దోషం, తన లోపం, అప్పుడు, ఆ క్షణంలో ఒక్కసారిగా తెలిసివచ్చినట్లు అయింది. నూతన చైతన్యం వచ్చింది. వెంటనే కార్యోన్ముఖుడు అయ్యాడు.

రామారావు హడావిడిగా అడుగుముందుకు వేశాడు.

---